సాక్షి కామారెడ్డి

బుధవారం । 2 । జూలై । 2025



నాణ్యతతో నిర్మించుకోవాలి

ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతతో నిర్మించుకోవాలని అదనపు కలెక్టర్ చందర్ నాయక్ లబ్ధిదారులకు సూచించారు.

- 8లో ▸



రెవెన్యూ సమస్యలు..

రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అధికారులకు సూచించారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం

33.1 /21.6

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అడపాదడపా వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'సరిపడా ఎరువులున్నాయి'



సదాశివనగర్ : జిల్లాలో సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన అడ్లూరు ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్, విండో కార్యాలయం, సదాశివనగర్, పద్మజీవాడి, ఉత్తనూర్ సొసైటీలను తనిఖీ చేశారు. ఎరువుల పంపిణీపై ఆరా తీశారు. జిల్లాలో ఎరువుల కొరతలేదని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి, ఏఈవోలు పాల్గొన్నారు.

డీపీఎంల బదిలీ



కామారెడ్డి క్రైం : జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలో ముగ్గురు డీపీఎంలు బదిలీపై ఇతర జిల్లాలకు వెళ్లారు. ఇతర జిల్లాలనుంచి నలుగురు జిల్లాకు వచ్చారు. ఇక్కడ డీపీఎంలుగా పనిచేసిన సుధాకర్, రమేశ్‌బాబు, రవీందర్ బదిలీపై ఇతర జిల్లాలకు వెళ్లారు. నిజామాబాద్ జిల్లా నుంచి డీపీఎంలు శ్రీనివాస్, సాయిలు, నిర్మల్ నుంచి శోభారాణి, సిద్దిపేట నుంచి రాజయ్య కామారెడ్డి జిల్లాకు వచ్చారు. ప్రస్తుతం డీఆర్‌డీఏ పింఛన్‌ల విభాగం డీపీఎంగా ఉన్న సురేష్ కుమార్‌ను వ్యవసాయ ఆధారిత జీవనోపాదుల డీపీఎంగా మార్చారు. నూతన డీపీఎంలు మంగళవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సురేందర్, అధికారులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ సభకు తరలిరావాలి'



కామారెడ్డి టౌన్: హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో ఈనెల 4న నిర్వహించే కాంగ్రెస్ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు తరలిరావాలని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొనే ఈ సభకు ప్రతి నియోజకవర్గం నుంచి గ్రామ అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడుగుల శ్రీనివాస్, నాయకులు పంపరి లక్ష్మణ్, రాజాగౌడ్, లక్కపత్రి గంగాధర్, కిరణ్ కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపిక



కామారెడ్డి అర్బన్: గర్గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థులు వీణ, భవానీ జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. తెలంగాణ హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీలలో ప్రతిభ చూపడంతో రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈనెల 3 నుంచి 8వ తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రంలో నిర్వహించే జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాలికల హాకీ పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. పాఠశాల హెడ్ మాస్టర్ ఎల్లయ్య, ఉపాధ్యాయులు, గ్రామస్తులు క్రీడాకారులు వీణ, భవానీలను అభినందించారు.

ప్రారంభమైన ఎంసెట్ ధ్రువపత్రాల పరిశీలన

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎంసెట్ మొదటి విడత ధ్రువపత్రాల పరిశీలన మంగళవారం ప్రారంభమైంది. ధ్రువపత్రాల పరిశీలనకు 823 మంది కామారెడ్డి కేంద్రాన్ని ఎంచుకున్నారని కౌన్సెలింగ్ సమన్వయకర్త, కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ తెలిపారు. ఈనెల 4వ తేదీ వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కొనసాగుతుందన్నారు. పరిశీలనలో అధికారులు అజారుద్దీన్, ఫర్హీన్ ఫాతిమా, అఫ్రీన్ ఫాతిమా, శ్రీలత, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మలిసందెలో మౌన వేదన!



మలి సందె వయసులో చాలా మంది నిర్లక్ష్యానికి గురవుతున్నారు. వృద్ధాప్యం కారణంగా వెన్నాడే అనారోగ్య సమస్యలు ఒకవైపు.. రక్తం పంచుకు పుట్టిన బిడ్డలు నిరాదరించడం మరోవైపు.. వెరసి పండుటాకులు మానసికంగా నలిగిపోతున్నారు. ఆప్యాయంగా ఒక్క మాటైనా మాట్లాడని, కడుపునిండా బువ్వపెట్టడానికీ మనసొప్పని వారసులున్న తమ గతిని తలచుకుని పలువురు మౌనంగా రోదిస్తున్నారు. అయితే ఇలాంటివారి రక్షణకు సర్కారు చర్యలు చేపడుతుండడంతో ఆ అంశంపై చర్చ నడుస్తోంది.

- వృద్ధాప్యంలో వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు
- పట్టించుకోని పిల్లలు
- మందులతోపాటు తిండి కూడా పెట్టని వారసులెందరో..
- తల్లిదండ్రులను పట్టించుకోని ఉద్యోగుల వేతనాల్లో కోత విధించే యోచనలో సర్కారు
- అమలు చేయాలని కోరుతున్న పలువురు..

✤ జిల్లా కేంద్రానికి సమీపంలోని ఓ గ్రామంలో కొన్నాళ్ల క్రితం ఓ వృద్ధురాలు చనిపోయింది. ఆమెకు ఇద్దరు కుమారులు. వారిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులే.. వారి పిల్లలు కూడా పెరిగి పెద్దయ్యారు. కానీ తల్లి అంత్యక్రియలు జరగాలంటే ఆస్తి పంపకాల గొడవ తేలాలని పట్టుబట్టారు. దీంతో రెండు రోజుల పాటు అంత్యక్రియలు ఆగిపోయాయి. చావుకు వచ్చిన బంధువులు ఆస్తుల లెక్కలు గట్టి ఇద్దరికీ పంచేసి, అప్పటికప్పుడు రిజిస్ట్రేషన్ చేయించారు. ఆ తర్వాతే అంత్యక్రియలు జరిగాయి.

✤ భిక్కనూరు మండలానికి చెందిన ఓ వృద్ధురాలి పేరిట ఉన్న ఆస్తిని ఒక కొడుకు తన పేరుపైకి మార్చుకున్నాడు. దీంతో మరో కుమారుడికి అన్యాయం జరిగింది. ఈ గొడవ జరుగుతుండగానే తల్లి చనిపోయింది. ఆస్తి విషయంలో బంధువులు ఇంకో కొడుకును నిలదీశారు. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఆస్తిని మార్పించేదాకా అంత్యక్రియలు జరగలేదు.

✤ తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన వృద్ధులు తమ పిల్లలు పట్టించుకోవడం లేదని ఇటీవల ఎస్పీ రాజేశ్ చంద్రకు మొరపెట్టుకున్నారు. దీంతో ఆయన కొడుకులను పిలిపించి మాట్లాడారు. కన్నవారిని నిర్లక్ష్యం చేస్తే చర్యలుంటాయని హెచ్చరించారు.

ఇలా చాలాచోట్ల పండుటాకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే తమ బిడ్డలకు చెడ్డ పేరు రావొద్దన్న ఉద్దేశంతో కొందరు బయటకు చెప్పుకోలేక లోలోపలే కుమిలిపోతున్నారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : బిడ్డ ఆకలి తీర్చేందుకు తల్లి ఆరాటపడితే, బిడ్డ భవిష్యత్తు కోసం తండ్రి తపిస్తాడు. ఇద్దరూ పిల్లలు ఉన్నతంగా ఎదగాలని తమ శక్తినంతా ధారపోస్తారు. అంత చేసినా వారు ఆశించేది ప్రేమ, ఆప్యాయతలే.. ఆపై చేతగాని వయసులో నాలుగు మెతుకులు పెడితే చాలనుకుంటారు. ఉన్నన్ని రోజులు ఆనందంగా గడపాలన్నది వాళ్ల ఆశ. అయితే కొందరు పిల్లలు తల్లిదండ్రులను భారంగా భావిస్తున్నారు. వాళ్ల ఆలనాపాలన చూడాలంటేనే భారంగా ఫీలవుతున్నారు. వాళ్లందించిన చదువుతో పొందిన ఉద్యోగాలతో ఉన్నతంగా ఎదిగిన వాళ్లు నాకేమన్నా కార్పొరేట్ చదువులు చదివించిండ్రా అనే మాటలు మాట్లాడుతున్నారు. వాళ్లు చేసిందేమీ లేదని, తానే కష్టపడి చదువుకుని ఉద్యోగం పొందానని మరికొందరు చెబుతుంటారు. వ్యాపారం, వృత్తులు, కులవృత్తులు, వ్యవసాయం, ఇతర పనుల్లో ఉన్న వారిలోనూ కొందరు కన్నవారిని నిర్లక్ష్యం చేస్తున్నారు. కొడుకులకు ఉద్యోగాలు ఉన్నాయని తల్లిదండ్రులకు పింఛన్ రావడం లేదు. ఇటు కొడుకులు పట్టించుకోక.. అటు పింఛన్లు రాక చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు.

వేధించే సమస్యలెన్నో..

వయసుతోపాటే అనారోగ్య సమస్యలు పెరుగుతాయి. బీపీ, షుగర్, కంటి చూపు మందగించడం, చెవులు వినిపించకపోవడం, పక్షవాతంతో కాళ్లు చేతులు పనిచేయక మంచానికే పరిమితమవడం, మోకాళ్లు, కీళ్లనొప్పులతో నడవలేకపోవడంతో పాటు ఇతర సమస్యలతో చాలా మంది ఇబ్బందిపడుతుంటారు. ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవడానికి వేలాది రూపాయలు అవసరం అవుతాయి. అయితే చేతిలో డబ్బులులేని పండుటాకులు.. కొడుకులు, కూతుళ్ల వద్ద చేయి చాపాల్సి వస్తోంది. కొందరయితే కన్నవారు మంచాన పడినా సరే అటువైపు కన్నెత్తి చూడడం లేదు. మరికొన్ని చోట్ల ఓ మనిషిని పెట్టి చేతులు దులుపుకుంటున్నారు. ఇంకొందరు వృద్ధాశ్రమాలు, అనాథ ఆశ్రమాల్లో చేర్పిస్తున్నారు. ఆరోగ్య సమస్యలతో సతమతమవుతూ మరోవైపు బిడ్డల ఆదరణ లేక చాలామంది వృద్ధులు మనోవేదనకు గురవుతున్నారు. కొడుకు, కోడలు, మనవలు, మనవరాళ్లు అందరూ ఉన్నా అనాథలా ఉండాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.

అమలయ్యేనా?

తల్లిదండ్రులను పట్టించుకోని కొడుకులపై చర్యలు తీసుకునే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అలాంటి కొడుకుల వేతనంలో 10 శాతం నుంచి 15 శాతం కట్ చేసి తల్లిదండ్రులకు ఇవ్వాలనే అంశం మీద కసరత్తు చేస్తోంది. దీంతో కన్నవారిని నిర్లక్ష్యం చేసే ఉద్యోగులు, అధికారుల్లో అలజడి మొదలైంది. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ఉద్యోగుల విషయంలోనే కాదు.. వ్యాపారం, వృత్తులు చేసుకునే వారి విషయంలోనూ ఇలాగే వ్యవహరించాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. వృద్ధులైన తల్లిదండ్రులను ఆదరించని కొడుకుల విషయంలో కఠినంగా వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు.

ఆస్తుల గొడవలూ కారణమే..

భూముల ధరలు భారీగా పెరిగిన తరువాత ప్రతి ఇంటా ఆస్తి గొడవలు మొదలయ్యాయి. తల్లిదండ్రులు సంపాదించి ఇచ్చిన ఆస్తులను అనుభవిస్తూనే పంపకాల్లో తేడాలు వచ్చాయంటూ కొందరు గొడవలు పడుతున్నారు. ఆస్తి గొడవల మూలంగా పలువురు కొడుకులు తల్లిదండ్రులను పట్టించుకోకుండా రోడ్డున పడేస్తున్నారు. చాలామంది లోలోపల బాధపడుతూ బతుకు వెళ్లదీస్తున్నారు. కొందరు తల్లిదండ్రులు కుల పెద్దలను, గ్రామ పెద్దలను, పోలీసులను కలిసి తమ గోడును వెళ్లబోసుకుంటున్నారు. కొందరు అధికారులు వారి ఆవేదనను అర్థం చేసుకుని తల్లిదండ్రులను చూడాల్సిన బాధ్యత మీదేనంటూ వారికి స్పష్టం చేస్తున్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దాలి

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

తాడ్వాయి : విద్యార్థులను పూర్తి స్థాయిలో తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులే తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. ఆయన మంగళవారం తాడ్వాయితో పాటు దేవాయిపల్లి గ్రామంలో పర్యటించారు. ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ కేంద్ర భవనం, వంటగది, ప్రహరీ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కుండీలలో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. నిబంధనలకు అనుగుణంగానే ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. మొదటి విడత బిల్లులు త్వరలోనే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలో జమ అవుతాయన్నారు.

అనంతరం ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. పాఠశాల ఆవరణలో మొక్కను నాటి, నీళ్లు పోశారు. దేవాయిపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఆయన వెంట డీఈవో రాజు, హౌజింగ్ డీఈ సుభాష్, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, తహసీల్దార్ శ్వేత, ఎంపీవో సవిత, ఏపీవో కృష్ణగౌడ్, ఏపీఎం మనోహర్, ఎంఈవో రామస్వామి, హెచ్ఎం కళ్యాణి, కార్యదర్శి బాలు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాలు తగ్గాయి

- నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం
- ఎస్పీ రాజేశ్ చంద్ర
- అర్ధ వార్షిక నేర సమీక్ష విడుదల



కామారెడ్డి క్రైం : ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టడం, నిబంధనలను పకడ్బందీగా అమలు చేయడంతో జిల్లాలో రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పట్టిందని ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. మంగళవారం ఆయన 2024–25 అర్ధ వార్షిక నేర సమీక్షను విడుదల చేశారు. గతేడాది మొదటి ఆరు నెలలతో పోలిస్తే ఈసారి జిల్లాలో నేరాలు, కేసులు తగ్గుముఖం పట్టాయని పేర్కొన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న 28 బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి నివారణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. సెల్‌ఫోన్‌ల రికవరీలో రాష్ట్రంలోని కమిషనరేట్‌లు మినహా జిల్లాలలో కామారెడ్డి అగ్రస్థానంలో ఉందన్నారు. హోంగార్డు నుంచి ఏఎస్సై స్థాయి వరకు 192 మంది సిబ్బందికి కౌన్సెలింగ్ నిర్వహించి స్పౌస్, సీనియారిటీ, హెల్త్ గ్రౌండ్స్ పరిగణనలోకి తీసుకొని బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామన్నారు. జిల్లాలో ఇద్దరు కానిస్టేబుళ్లు చనిపోగా వారి కుటుంబ సభ్యులకు 2 నెలల్లోనే కారుణ్య నియామకాలను పూర్తి చేశామని పేర్కొన్నారు. డయల్ 100 కు సమాచారం అందిన నిమిషాల వ్యవధిలోనే బాధితుల వద్దకు బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ సిబ్బంది చేరుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. కేసుల సంఖ్యను మరింతగా తగ్గించే విధంగా, జిలాల్లో నేరాలు తగ్గి ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. నేర సమీక్ష నివేదికలోని వివరాలు..

■ 2024లో జూన్ నెలాఖరు వరకు జిల్లాలో 317 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. వాటిలో 152 కేసుల్లో 160 మంది చనిపోయారు. ఈ ఏడాది తొలి ఆరు నెలల కాలంలో 282 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇందులో 120 ప్రమాదాల్లో 125 మంది మరణించారు. గతేడాదితో పోలిస్తే 22 శాతం మరణాలు తగ్గాయి.

■ గతేడాది తొలి ఆరు నెలల్లో లైసెన్స్ లేని 75,179 మందికి చలానాలు విధించారు. అతివేగంగా వాహనాలు నడిపినందుకు 43,348, హెల్మెట్ లేనందుకు 16,340, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు సంబంధించి 5,942 చలాన్‌లను విధించారు.

■ దొంగతనం కేసులు గతేడాది జూన్ ఆఖరువరకు 259 నమోదయ్యాయి. ఈసారి 214 కు తగ్గాయి. రాత్రి సమయాల్లో జాతీయ రహదారుల వెంట ఆగి ఉన్న వాహనాలను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు, దారి దోపిడీలకు పాల్పడుతున్న 11 మంది సభ్యుల ముఠా(పార్థి గ్యాంగ్)ను అరెస్ట్ చేశారు.

■ గతేడాది తొలి అర్ధ భాగంలో మహిళలపై దాడులు, వేధింపులు, వరకట్నం కేసులు 174 నమోదు కాగా ఈసారి 167 కు తగ్గాయి.

■ జిల్లాలో ఈ ఏడాది జూన్ చివరి వరకల్లా ఆరుగురు నిందితులకు యావజ్జీవ శిక్ష, 12 మందికి ఏడేళ్లలోపు శిక్షలు పడ్డాయి.

■ డయల్ 100కు 22,102 ఫోన్ కాల్స్ వచ్చాయి. వాటిలో 137 కేసులు నమోదయ్యాయి. మిగతా వాటిని సామరస్యంగా పరిష్కరించారు.

■ సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 3,265 సెల్‌ఫోన్లను రికవరీ చేశారు. వాటి విలువ దాదాపు రూ.7 కోట్లు. ఈ ఏడాదిలోనే 452 సెల్‌ఫోన్‌లు రికవరీ చేశారు.

ఖాళీ స్థలాలు.. అపరిశుభ్ర నిలయాలు

- ఏళ్ల తరబడి తమ ప్లాట్లవైపు కన్నెత్తి చూడని స్థలాల యజమానులు
- పిచ్చి మొక్కలు, మురుగుకు నిలయాలు, దోమలు, ఈగలు, పాములకు ఆవాసాలు..
- వ్యాధుల బారిన పడుతున్న పట్టణవాసులు



స్నేహపురి కాలనీలో పెరిగిన పిచ్చి మొక్కలు

కామారెడ్డి టౌన్: పట్టణంలోని ఖాళీ స్థలాలు అపరిశుభ్ర వాతావరణానికి నిలయాలుగా మారాయి. ఈ ప్లాట్లను శుభ్రం చేసుకోవాల్సిన బాధ్యత వాటి యజమానులదే. కానీ వారు ఏళ్ల తరబడిగా పట్టించుకోకపోవడంతో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు, మురుగు నీటితో నిండిపోతున్నాయి. వర్షాకాలంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. వర్షాలకు వాటిలో నీరు నిలిచి మురికి కూపంలా తయారవుతున్నాయి. నిల్వ నీటిలో దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మందస్తు చర్యల్లో భాగంగా ఇటువంటి స్థలాలపై దృష్టి పెట్టి, అపరిశుభ్ర వాతావరణం లేకుండా చూడాలని కోరుతున్నారు.

ప్రతి వార్డులో వందల సంఖ్యలో..

కామారెడ్డి పట్టణంలో 49 వార్డులున్నాయి. ప్రతి వార్డులో వందకు పైగా ఖాళీ స్థలాలున్నాయి. విలీన గ్రామాలతో పాటు, శివారు కాలనీలలో అంతకుమించి ఖాళీ స్థలాలు ఉన్నాయి. సమీపంలోని ఇళ్ల వాసులు చెత్తాచెదారాన్ని ఈ ఖాళీ ప్రదేశాల్లో పడేస్తుండడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఖాళీ స్థలాలు దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. అశోక్‌నగర్, స్నేహపురి కాలనీ, శ్రీరాంనగర్, బతుకమ్మకుంట, విద్యానగర్, ఎన్జీవోస్ కాలనీ, దేవునిపల్లి, వికాస్‌నగర్, గాంధీనగర్, టీచర్స్‌కాలనీ, ఇందిరానగర్, రాజానగర్, అయ్యప్పనగర్, భవానీనగర్, హౌసింగ్‌బోర్డు, బడాకసాబ్‌గల్లి, సైలానీబాబా కాలనీ, పంచముఖి హనుమాన్, రుక్మిణీకుంట, ఒడ్డెరకాలనీ, వాంబేకాలనీ, గ్రీన్‌సిటీ తదితర కాలనీలతో పాటు విలీన గ్రామాలైన అడ్లూర్, రామేశ్వరపల్లి, పాతరాజంపేట, సరంపల్లి, దేవునిపల్లి, లింగాపూర్, టేక్రియాల్‌లలో ఇళ్ల పక్కన ఖాళీ స్థలాలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి ఖాళీ ప్లాట్ల యజమానులకు నోటీసులు ఇచ్చి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



రాజీవ్‌నగర్ కాలనీలో మురుగు నీటి కుంటగా..



శ్రీరాంనగర్ కాలనీలో..

“ నోటీసులు జారీ చేస్తాం

పట్టణంలో అధ్వానంగా ఉన్న ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. ముందస్తుగా ఖాళీ స్థలాల యజమానులు స్పందించి వారి ప్లాట్లను శుభ్రం చేసుకోవాలి.

– రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, కామారెడ్డి

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- పార్టీ సిద్ధాంతాలు, విధివిధానాలను కార్యకర్తలు తెలుసుకోవాలి
- క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, వేదికపై ఎంపీ సురేశ్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు మదన్‌మోహన్ రావు, లక్ష్మీకాంతారావు, సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి

నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలు, విధివిధానాలను కచ్చితంగా తెలుసుకుని ముందుకు వెళ్లాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) సూచించారు. మంగళవారం నిజామాబాద్‌లో ఈపీఎం గార్డెన్స్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్లమెంటరీ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, కోరుట్ల, జగిత్యాల, జుక్కల్‌ల నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఆయా కార్పొరేషన్ల చైర్మన్‌లు, జిల్లా బాధ్యులు, పలు విభాగాలకు చెందిన నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వాటిని ప్రజలకు చేరవేయడంలో కార్యకర్తలు వెనకబడి ఉన్నారన్నారు. ఈనెల 4న హైదరాబాద్‌లో నిర్వహించే కార్యకర్తల సదస్సుకు వేల సంఖ్యలో కార్యకర్తలు హాజరు కావాలని, ప్రతి గ్రామం నుంచి 500 మందిని తీసుకురావాలని పిలుపునిచ్చారు.

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా జిల్లాకువచ్చి డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తుందని మాట్లాడారని, డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఏమీ లాభం లేదని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ పేర్కొన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎలాంటి అభివృద్ధి లేదన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు డబుల్ ఇంజిన్ సర్కార్ ఉన్న రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రేషన్ దుకాణాల్లో మోదీ బొమ్మ పెట్టాలనడం అర్థరహితమన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మదన్‌మోహన్ రావు, లక్ష్మీకాంతారావు, సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి, సంజయ్, వెడ్మ బొజ్జు, కార్పొరేషన్‌ల చైర్మన్‌లు ఈరవత్రి అనిల్, తాహెర్‌బిన్ హందాన్, మానాల మోహన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, నేతలు ఏనుగు రవీందర్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, వినయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు ఇన్సూరెన్స్ చేసుకోవాలి

కామారెడ్డి టౌన్: ప్రతి ఒక్కరు ఇన్సూరెన్స్ చేసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఫైనాన్షియల్ ఇంక్లూషన్ క్యాంపెయిన్ ప్రోగ్రాంకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 30వ తేదీ వరకు మూడు నెలలపాటు ప్రజలకు ఇన్సూరెన్స్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. అందరితో బ్యాంక్ ఖాతాలు తెరిపించడం, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, జీవన్ జ్యోతి, అటల్ పెన్షన్ యోజన తదితర స్కీంలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరితో మినిమం ఇన్సూరెన్స్ చేయించాలని అదనపు కలెక్టర్ చందర్‌నాయక్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ చందర్ నాయక్

క్లుప్తంగా

ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా కమిటీ ఎన్నిక

కామారెడ్డి టౌన్: లంబాడ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) జిల్లా కమిటీతో పాటు అనుబంధ సంఘాల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో కమిటీలను ప్రకటించి నియామక పత్రాలను అందజేశారు. ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా నునావత్ గణేష్ నాయక్, గౌరవ అధ్యక్షుడిగా రూప్ సింగ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శంకర్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా బద్రి నాయక్, యూత్ జిల్లా అధ్యక్షుడిగా బాదావత్ ప్రేమ్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జబ్బర్ నాయక్, కామారెడ్డి పట్టణ అధ్యక్షుడిగా మోహన్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడిగా ప్రకాష్, ఉపాధ్యక్షుడిగా శంకర్, కామారెడ్డి డివిజన్ అధ్యక్షుడిగా రవి కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడిగా సంజీవ్ కుమార్, మాచారెడ్డి, రాజంపేట, తాడ్వాయి మండలాల అధ్యక్షులుగా బన్సీలాల్, జైల్ సింగ్, రమేష్‌లను ఎన్నుకున్నారు. ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్ ఉన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

- బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి



నిజాంసాగర్(జుక్కల్): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. మంగళవారం మహమ్మద్‌నగర్ మండల తహసీల్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సుల వారీగా వచ్చిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ సవాయిసింగ్ తదితరులున్నారు.

ఫిజియో, స్పీచ్ థెరపిస్టుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి టౌన్: జిల్లాలోని భవిత కేంద్రాలలో విద్యార్థులకు థెరపి సేవలను అందించేందుకు అర్హులైన ఫిజియోథెరపిస్ట్, స్పీచ్ థెరపిస్టుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో ఎస్.రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయం రూమ్ నంబర్ 223లో ఈనెల 7లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

వర్షాకాలం.. పాములతో పైలం

- ముఖ్యంగా పంట పొలాల్లో పొంచి ఉన్న ప్రమాదం
- గతేడాది పాముకాటుతో తండ్రీకొడుకుల మరణం
- నాటు వైద్యంతో కాలయాపన చేయొద్దు
- జాగ్రత్తలు పాటించడమే నివారణకు మార్గం



రాజంపేట: వర్షాకాలం బీడుభూములు, ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, గడ్డితో ఏపుగా పెరిగే అవకాశం ఉంటుంది. మురికి నీటి గుంతలు, మడుగుల్లో నీరు నిలవడంతో కప్పలు, పాములు, విష పురుగులు బయటకొచ్చి సంచరిస్తుంటాయి. ఈ క్రమంలో రైతులు వ్యవసాయ కూలీలు, అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండేవాళ్లు, పంట పొలాలకు దగ్గరగా నివాస ప్రాంతాలున్న వారు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా పాముకాటుకు గురయ్యే ప్రమాదం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో పాములు ఎక్కువగా కనిపిస్తుంటాయి. గత సంవత్సరం వర్షాకాలంలో రాజంపేట మండలంలోని శేర్‌శంకర్ తండాకు చెందిన తండ్రి కొడుకులైన రవి, వినోద్‌లు ఇంట్లో పాముల కాటుకు గురై కాలయాపన కారణంగా చనిపోయారు. ఇంటి సరిసరాలు సరిగా లేకపోయినా, రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నప్పుడు పాముకాటుకు గురయ్యే అవకాశం ఎక్కువ ఉంటాయి. పాముకాటుకు గురైనప్పుడు ప్రాణాపాయం నుంచి బయట పడాలంటే జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి..

పాములు ఎక్కువగా ఉండే ప్రాంతాలు..

పొలం, కాల్వ గట్లు, వాగులు, పశువుల పాకలు, పిచ్చి మొక్కలతో నిండి పొదలు, గడ్డి వాములు, పాడుబడ్డ ఇళ్లు, ఇళ్ల ముందు పేర్చిన కట్టెలు, పెంటకుప్పల్లో పాములు ఎక్కువగా తిరుగుతుంటాయి. ఆహారం కోసం బయటకు వచ్చి ఎలుకలు, బల్లులు, తొండలు, పక్షులను తింటాయి. ఇలాంటి ప్రాణులు ఎక్కడ ఎక్కువగా సంచరిస్తాయో పాములు అక్కడ తిష్ట వేస్తాయి. నాగు పాము, కట్ల పాము, రక్తపింజర తదితర పాములు విషపూరితమైనవి. వీటికాటుకు గురైన బాధితులకు వెంటనే వైద్యం అందకపోతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. పాముల్లో చాలా వాటికి విషం ఉండదు. తాచు, కట్ల పాము వంటి 15 శాతం పాములే విషపూరితమైనవి ఉంటాయి. మిగతా పాములు కరిచినా సాధారణ చికిత్సతో నయమవుతాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

రాత్రి వేళల్లో తిరిగే వాళ్లు, అక్కడే నిద్రించే వాళ్లు టార్చ్ లైట్ వెంట తీసుకుపోవాలి. పాములు చేరడానికి అవకాశం లేకుండా పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. పెట్రోల్, కిరోసిన్, వెల్లుల్లి, ఇంగువ వాసనలను పాములు భరించలేవు. పాములు ఎక్కువగా ఉన్నాయనిపిస్తే సమయానుకూలంగా వీటిని ఉపయోగించుకోవాలి. రాత్రి వేళల్లో పొలాల గట్లపై, గడ్డివాముల్లో తిరిగే రైతులు, కూలీలు మోకాళ్ల వరకు రబ్బరు బూట్లు, చేతులకు రబ్బరు తొడుగులు వేసుకోవడం ఉత్తమం.

ప్రథమ చికిత్స ఇలా..

- పాముకాటుకు గురైన వ్యక్తి ఆందోళన చెందొద్దు. పక్కవారు బాధితుడికి ధైర్యం చెప్పాలి.
- పాముకాటేసిన పై భాగంలో వెంటనే తాడు, గుడ్డతో బిగుతుగా కట్టాలి.
- కాటు వద్ద పదునైన బ్లేడు గాయం చేసి రక్తం కారనివ్వాలి. పాముకాటుకు గురైన వ్యక్తిని నడిపించడం, పరిగెత్తించడం చేయొద్దు. నాటువైద్యం పేరిట పసర్లు, వేర్లు, మంత్రాలు అంటూ కాలయాపన చేయకుండా వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లాలి. కాటేసిన పాము అంతకు ముందు ఆహారం తీసుకున్నా.. అంతకు ముందు వేరే జీవిని కాటేసినా విష ప్రభావం తక్కువగా ఉంటుంది.

నాటు వైద్యం వద్దు



ఎవరైనా పాము కాటు ప్రమాదం బారిన పడిన వెంటనే దగ్గర్లోని ఆస్పత్రికి తీసుకెళ్లాలి. కొందరు నాటు వైద్యం పేరిట కాలయాపన చేసి ప్రాణాల మీదకు తెచ్చుకుంటారు. ఇలాంటి పొరపాట్లు చేయవద్దు. ఇళ్ల చుట్టూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పంట పొలాల వద్ద జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి.

– విజయమహాలక్ష్మి, వైద్యులు, రాజంపేట

నాటి మా రాముని పల్లెనే.. నేటి మారంపల్లి

మీకు తెలుసా?

గోదావరి సమీపంలో ఉన్న మారంపల్లికి తెలుసుకోదగిన చరిత్ర ఉంది. రాముడు గంగానది వెంట పరిక్రమణ చేసినట్లు స్థల పురాణం ఉంది. ఎస్సారెస్పీలో ముంపునకు గురైన పాత కుస్తాపురం శివలింగాన్ని స్వయంగా రాముడే ఇసుకతో తయారు చేసినట్లు చరిత్ర ఉంది. రాముడు తిరిగిన నేల కావడంతో ఆయనపై ప్రేమతో 'మా రాముని పల్లె'గా నామకరణం చేశారు. కాలక్రమేనా అది మారంపల్లిగా మారింది.

- సుమారు 300 ఏళ్ల క్రితం మా రాముని పల్లెను స్థాపించుకున్నారు. మొదట ఇక్కడ 15 నుంచి 20 ఇళ్లు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం 660 వరకు ఉన్నాయి. వ్యవసాయ భూములు కలుపుకొని ఊరి పూర్తి విస్తీర్ణం సుమారు 1,150 ఎకరాలు.
- ఊరిలో ఒకప్పుడు పెద్ద గడీ ఉండేది. ఈ గడీ గుండానే అప్పటి రాజులు, దొరలు పాలించేవారు. గడీ కూలిపోయి చాలా సంవత్సరాలు అవుతుంది.
- గ్రామానికి నలుదిక్కులా ఆరు చెరువులు ఉన్నాయి. వాటి పేర్లు సత్తర్‌కుంట, నాంకుంట, చించెరు, పెద్దచెరు, బందం కుంట, కమ్మరి కుంట. వీటిని ఇప్పటికీ ఇలాగే పిలుస్తున్నారు. వానాకాలంలో ఇవి పూర్తిగా నిండి ఊరు ఒక ద్వీపం మాదిరిగా కనిపిస్తుంది.
- ఊరు కళాకారులకు నిలయమని చెప్పవచ్చు. అప్పట్లో నాటకాలు వేయడంలో ప్రసిద్ధులు. నేటి తరం దానిని అంది పుచ్చుకుని ఇప్పుడు భజనలు, కీర్తనలు చేస్తున్నారు.
- 1959లో ఊరిలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు కాగా, 1966లో గ్రామానికి మొదటి సర్పంచ్‌గా కృష్ణారెడ్డి పనిచేశారు.



మారంపల్లి ముఖ చిత్రం

– దొండేశ్వర్(ఆర్మూర్)

మధ్యాహ్న భోజనం కలేనా?

- ఇంటర్ విద్యార్థులకు కాలేజీల్లో భోజన సౌకర్యంపై గతేడాది ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- ఇప్పటికీ స్పష్టత ఇవ్వని వైనం

బాన్సువాడ: జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు కావడం కలేనా? అంటూ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్ విద్యార్థులకు కాలేజీల్లో భోజన సౌకర్యంపై గతేడాది ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా, ఇప్పటికీ స్పష్టత రాలేదు. దీంతో ఈ పథకం ఇప్పట్లో అమలు చేయడంపై సాధ్యం కాదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

పట్టణాలు, మండల కేంద్రాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ విద్య అభ్యసించేందుకు గ్రామీణ ప్రాంతాల నుంచి ఎంతో మంది విద్యార్థులు వస్తుంటారు. తమ గ్రామం నుంచి కళాశాలకు సమయానికి చేరుకునేందుకు ఉదయాన్నే బయలుదేరాల్సి వస్తోంది. అయితే కొందరు విద్యార్థులు ఉదయం భోజనం చేసి రావడం, అలాగే మధ్యాహ్నం భోజనం వెంటతెచ్చుకోవడం గగనంగా ఉంటోంది. అలాంటి విద్యార్థులు కళాశాలల్లో ఆకలి బాధతో తరగతులు వినాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసేందుకు గత సంవత్సరం ప్రభుత్వం ప్రతిపాదనలు స్వీకరించింది. 2024–2025 విద్యా సంవత్సరం చివరలో ఈ ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో.. 2025–26 విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి మధ్యాహ్న భోజన పథకం అమలవుతుందని అంతా భావించారు. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో ఈసారి కూడా పథకం అమలయ్యే సూచనలు కనిపించడం లేదు.

కార్యరూపం దాల్చేనా?

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభమైన తర్వాతే విద్యార్థుల హాజరు శాతం పెరిగింది. ఇదే ఫార్ములాను కళాశాలల్లో ప్రయోగిస్తే బాగుంటుందని అందరూ భావిస్తున్నారు. 2018లో అప్పటి ప్రభుత్వం అక్షయ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టాలని భావించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఆ తర్వాత 2021లో మరోమారు ఈ ప్రయత్నం చేసినప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. జిల్లా వ్యాప్తంగా 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. గతేడాది ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో సుమారుగా 4 వేల మందికిపైగా విద్యార్థులు విద్యనభ్యసించారు. ఈ సంవత్సరం అడ్మిషన్లు మరిన్ని పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కళాశాలల్లో భోజన సౌకర్యం కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆదేశాలు రాలేదు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు ప్రతిపాదనలున్నాయి. దీనిపై ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాల్సి ఉంది. ఎప్పటి నుంచి ప్రారంభిస్తారనే విషయాలపై ఎలాంటి ఆదేశాలు రాలేదు.

– షేక్ సలాం, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ ఆఫీసర్, కామారెడ్డి

యూరియా కోసం ఆందోళన

గాంధారి: సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల కేంద్రంలో రైతులు సింగిల్ విండో కార్యాలయం వద్ద గాంధారి–కామారెడ్డి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే ఎరువుల కొరతతో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కోసం వ్యవసాయ పనులు వదిలి వచ్చి క్యూలో నిల్చుంటున్నామని, అయినా అందరికీ దొరకడం లేదని పేర్కొన్నారు. ప్రైవేట్ దుకాణాలలో వారిచ్చే ఇతర రసాయనాలను కొనుగోలు చేస్తేనే యూరియా అమ్ముతున్నారని ఆరోపించారు. యూరియా కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు శంకర్‌రావు, రావు సాహెబ్‌రావు, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.



గాంధారిలో రాస్తారోకో చేస్తున్న రైతులు

షార్ట్ ఫిలిమ్స్‌తో బడివైపు విద్యార్థులు



షార్ట్ ఫిలిమ్‌ను తిలకిస్తున్న డీఈవో రాజు, ఉపాధ్యాయులు

లింగంపేట: షార్ట్ ఫిలిమ్స్‌తో విద్యార్థులు బడివైపు ఆకర్షితులవుతారని డీఈవో రాజు అన్నారు. మంగళవారం శెట్పల్లి ఉన్నత పాఠశాలలో షార్ట్ ఫిల్మ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏఎక్సెల్–ఎఫ్ఎల్ఎన్ (అసిస్టెడ్ లాంగ్వేజ్ అండ్ మాథ్స్ లర్నింగ్– ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసీ)లో భాగంగా ఏఐపైన షార్ట్ ఫిలిమ్ తీసినట్లు తెలిపారు. డిజిటల్ విద్యపై విద్యార్థులకు అవగాహన వస్తుందన్నారు. విద్యార్థులకు డిజిటల్ విద్యపై ఆసక్తి పెరిగి బడికి క్రమం తప్పకుండా వస్తారన్నారు. ఉపాధ్యాయులు షార్ట్ ఫిలిమ్స్ ఎక్కువగా రూపొందించి విద్యా ప్రమాణాలు పెంపొందించాలని సూచించారు. షార్ట్ ఫిల్మ్ అన్ని పాఠశాలల్లో ప్రదర్శించాలని సూచించారు. షార్ట్ ఫిల్మ్ డైరెక్టర్ స్టేట్ రిసోర్స్ పర్సన్ అఖిల్‌ను డీఈవో అభినందించారు. నిర్మించడానికి ఆర్థిక సహకారం అందజేసిన శెట్పల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు వసుధను అభినందించారు. జిల్లా సెక్టోరల్ అధికారి వేణుశర్మ, ఎంఈవోలు శౌకత్‌అలీ, రామస్వామి, సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఒకరి ఆత్మహత్య



రాములు మృతదేహం

వర్ని: మోస్రా మండలం చింతకుంట గ్రామంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ నాంపల్లి రాములు(53) మంగళవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు వర్ని ఎస్ఐ మహేష్ వెల్లడించారు. రాములు మృతికి గల కారణాలు తెలియరాలేదని అతడి తల్లి పోశవ్వ ఫిర్యాదులో పేర్కొంది. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



ఖలీల్‌వాడి: నగరంలోని పులాంగ్ వాగు వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి, వివరాలు సేకరించారు. మృతుడు చిత్తు కాగితాలు ఏరుకునే వ్యక్తిగా కనిపిస్తున్నట్లు తెలిపారు. గత కొద్దిరోజులుగా ఇక్కడే చుట్టుపక్కల తిరుగుతూ రోడ్డుపై పడుకుంటున్నట్లు పేర్కొన్నారు. మృతుడి వయస్సు సుమారు 55 నుంచి 60 ఏళ్ల మధ్య ఉండొచ్చని భావిస్తున్నారు. అతడు బ్రౌన్ కలర్ నైట్ ప్యాంట్ ధరించాడని, ఎవరికైనా తెలిసినట్లయితే పోలీస్ స్టేషన్‌లో గాని, 8712659840, 8712659719ను సంప్రదించాలని సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి రైల్వే స్టేషన్ మూడో ప్లాట్‌ఫాం పక్కనే ఉన్న ఓ గుంతలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు మంగళవారం మృతదేహాన్ని గుర్తించి, పోలీసులకు సమాచారం అందించగా, పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. అతడి వయస్సు 30–40 ఏళ్ల మధ్య ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు నలుపు, తెలుపు రంగుల పూల షర్టును ధరించాడన్నారు. మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి ఆనవాళ్లు తెలిసిన వారు పట్టణ పోలీసులను సంప్రదించాలని ఎస్‌హెచ్‌వో నరహరి కోరారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో పలువురికి జైలు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధుల్లో ఇటీవల డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా, 17మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డట్లు ఏసీపీ రాజావెంకట్ రెడ్డి తెలిపారు. వారికి మంగళవారం సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించి, జిల్లా కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. మేజిస్ట్రేట్ నూర్జహాన్ బేగం వారిలో ఆరుగురికి జరిమానా వేయగా, ఆరుగురికి ఒక రోజు, ఐదుగురికి రెండు రోజుల జైలు శిక్ష విధించారు.

నవీపేట: నవీపేట శివారులో పోలీసులు ఇటీవల డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి, మంగళవారం నిజామాబాద్ కోర్టులో హాజరుపర్చారు. జడ్జి అతడికి 7రోజుల జైలుశిక్ష విధించారు.

మోత్కూర్ పోలీసుల అదుపులో జిల్లా వృద్ధుడు



దండు గోవర్ధన్

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లాకు చెందిన వృద్ధుడు యాద్రాది జిల్లా మోత్కూర్ పోలీసుల అదుపులో ఉన్నట్లు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. నిజామాబాద్‌కు చెందిన దండు గోవర్ధన్(60) అనే వృద్ధుడు మోత్కూర్‌లో సంచరిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన వ్యక్తి కావడంతో ఇక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఇతని వివరాలు తెలిసినవారు మోత్కూర్ పీఎస్ 70970 52763 లేదా నాలుగో టౌన్ పోలీసులు 87126 59840, 8712659719ను సంప్రదించాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతతో నిర్మించుకోవాలి

- అదనపు కలెక్టర్ చందర్ నాయక్



పోతంగల్ కలాన్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు వేయిస్తున్న అదనపు కలెక్టర్ చందర్

గాంధారి(ఎల్లారెడ్డి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇళ్లను నాణ్యతతో సకాలంలో నిర్మించుకోవాలని కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చందర్ నాయక్ అన్నారు. మంగళవారం ఆయన డీపీవో మురళి, ఎంపీడీవో రాజేశ్వర్‌తో కలిసి మండల పరిధిలోని పోతంగల్ కలాన్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోయించారు. మహిళా సంఘాల్లో కుడుతున్న విద్యార్థుల దుస్తులను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, అంగన్ వాడి కేంద్రాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సి జాగ్రత్తల గురించి గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎంపీవో లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

నస్రుల్లాబాద్: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేక అధికారి దయానంద్ అన్నారు. సోమవారం బొమ్మన్‌దేవ్‌పల్లిలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో సూర్యకాంత్, జీపీ సిబ్బంది ఉన్నారు.

ఎల్లారెడ్డిరూరల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో ప్రకాష్ అన్నారు. మంగళవారం తిమ్మాపూర్‌లో పనులను పరిశీలించారు.

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బొల్లారంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మంగళవారం స్థానిక ఎంపీడీవో ప్రభాకరచారి పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాల్లో ఏమైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. పంచాయతీ కార్యదర్శి సంతోష్ ఉన్నారు.

పెద్దకొడప్‌గల్(జుక్కల్): త్వరగా ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని మండల ప్రత్యేక అధికారి కిషన్ సూచించారు. మంగళవారం వడ్లం, కాస్లాబాద్ గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి జ్యోతి

దోమకొండ: గ్రామాల్లో మొక్కలను నాటి వాటిని సంరక్షించే బాధ్యత పంచాయితీ కార్యదర్శులదేనని మండల ప్రత్యేకాధికారి, జిల్లా హార్టికల్చర్ అధికారి జ్యోతి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలానికి చెందిన పంచాయితీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. అంటు వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తప్పనిసరిగా పన్ను వసూలు చేసిన రసీదులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఈజీఎస్ ఏపీవో రజని పాల్గొన్నారు.

డబుల్ ఇంజిన్ సర్కార్‌తో లాభం లేదు



సమావేశంలో మాట్లాడుతున్న షబ్బీర్ అలీ, బల్మూరి వెంకట్, జీవన్‌రెడ్డి, సురేష్ షెట్కార్

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ
- నగరంలో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్లమెంటరీ విస్తృత స్థాయి సమావేశం

నిజామాబాద్ సిటీ: ఇటీవల జిల్లాకు వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తుందని మాట్లాడుతున్నారని, డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఏమీ లాభం లేదని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. నగరంలో మంగళవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్లమెంటరీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎలాంటి అభివృద్ధి లేదన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు డబుల్ ఇంజిన్ సర్కార్ ఉన్న రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రేషన్ దుకాణాల్లో మోదీ బొమ్మ పెట్టాలనడం అర్థరహితమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నా, వాటిని క్షేత్రస్థాయిలో ప్రచారం చేయడంలో మాత్రం వెనుకబడి ఉన్నామన్నారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలన్నారు. విభేదాలు పక్కనపెట్టి అంతా కలిసిమెలిసి పనిచేయాలన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. పాత, కొత్త తేడా లేకుండా కార్యకర్తలు, నాయకులు కలిసిమెలిసి పనిచేయాలన్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అమలుచేస్తున్న పథకాలు చూసి బీఆర్ఎస్ నాయకులు అసూయపడుతున్నారన్నారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. పసుపు బోర్డుతో కాకుండా, మద్దతు ధర లభించినప్పుడే పసుపు రైతుల కళ్లల్లో ఆనందం వస్తుందన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ తదితరులు మాట్లాడారు.

మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీవో సురేందర్ అన్నారు. మంగళవారం లింగంపేట మండల సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన పదాధికారుల శిక్షణ సమావేశంలో మాట్లాడారు. సంఘాల ఆదాయం పెరగడానికి కుటీర, చిన్నతరహా పరిశ్రమలు, డైరీ ఫాంలు, చేపల పెంపకం, పశువుల దానా తయారీ, తదితర పరిశ్రమలు ఏర్పాటుకు ప్రోత్సహించాలన్నారు. అదనపు డీఆర్‌డీవో విజయలక్ష్మి, డీపీఎం శ్రీనివాస్, ఎంపీడీవో నరేష్, మండల సమాఖ్య అధ్యక్షురాలు సులోచన, ఏపీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మద్నూర్(జుక్కల్): మేనూర్ మోడల్ స్కూల్‌లో గంటల ప్రాతిపదిక విధానంలో బోధించడానికి దరఖాస్తులు కోరుతున్నామని పాఠశాల ప్రిన్సిపాల్ ఏపీ నర్సాగౌడ్ మంగళవారం ఒక ప్రకనలో తెలిపారు. తెలుగు, పొలిటికల్ సైన్స్ బోధించుటకు ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ, బీఎడ్ పూర్తి చేసిన వారు 9 నుంచి 12 ఇంటర్మీడియట్ వరకు బోధించాలని, ఈ నెల 4 సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు.

పరీక్ష ఫీజు చెల్లించండి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలో బీఈడీ, బీపీఎడ్ రెండో, నాల్గో సెమిస్టర్ రెగ్యులర్ (2024–25), బ్యాక్ లాగ్ (2021 విద్యా సంవత్సరం) 1, 2, 3, 4 సెమిస్టర్ పరీక్ష ఫీజును ఈనెల 14వరకు చెల్లించాలని కంట్రోలర్ సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 100 అపరాధ రుసుంతో ఈనెల 15 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందని కంట్రోలర్ తెలిపారు. పూర్తి వివరాల కోసం తెలంగాణ వర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు